క్లుప్తంగా

రేపు నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని కేఆర్ మార్కెట్ ప్రాంతం లోబ్రిడ్జి వద్ద ఉన్న 900 ఎంఎం డయా పీఎస్ పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతులకు గురి కావడంతో ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని గాంధీనగర్, హనుమాన్‌పేట, పూర్ణానందంపేట, బావిస్తుపాలెం, కేదారేశ్వరరావుపేట, ఖుద్దూస్‌నగర్, లోటస్ ఏరియా, రామలింగేశ్వరపేట, సత్యనారాయణపురం, దుర్గాపురం, గులాబీతోట, మధురానగర్, శ్రీనగర్‌కాలనీ, భాను నగర్, టీచర్స్ కాలనీ, ముత్యాలంపాడు, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, అరండల్‌పేట, కస్తూరిబాయి పేట, గిరిపురం, దుర్గా అగ్రహారం, సీతారామపురం, బాడవపేట, ఉడ్డీ పేట, లబ్బీపేట, మల్లిఖార్జునపేట, వాగు కొండ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాలకు 28వ తేదీ సాయంత్రం నీటి సరఫరా పునరుద్ధరణ చేస్తామన్నారు. స్థానికులు ముందుగా నీటిని నిల్వచేసుకుని వీఎంసీ సిబ్బంది, అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

బ్యాడ్మింటన్‌లో సిద్ధార్థ మహిళా కాలేజీ జట్టు సత్తా



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కాలేజీ క్రీడాకారులను ఆ కాలేజీ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, కన్వీనర్ లలితా ప్రసాద్ మంగళవారం అభినందించారు. ఉయ్యూరు ఏజీ, ఎస్‌జీ ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో ఇటీవల జరిగిన పోటీల్లో తమ కాలేజీ జట్టు రాణించి ప్రథమ స్థానం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా కాలేజీ క్రీడాకారిణులు ఎ.శ్రీరాజ్ఞి, కె.ఉమామహేశ్వరి సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టులో చోటు దక్కించుకున్నారని చెప్పారు. జట్టుకు శిక్ష ఇచ్చిన కోచ్ పి.భాస్కర్‌ను వారు అభినందించారు.

అభినయ కళా సరస్వతి సినీ నటి సావిత్రి



విజయవాడకల్చరల్: అభినయ కళా సరస్వతి మహానటి సావిత్రి అని ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సావిత్రి వర్ధంతి, మహానటి సావిత్రి సంఘటనా సామ్రాట్ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ బహుముఖ ప్రతిభాశాలి సావిత్రిగా అభివర్ణించారు. కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి ఆశయ సాధన కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రతి ఏటా సావిత్రి జయంతి సందర్భంగా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. 2023వ సంవత్సరానికి గానూ ఈవెంట్ అధినేత శ్రీ సత్యకు మహానటి సావిత్రి సంఘటనా ఈవెంట్ సామ్రాట్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్, రమణ, చావా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు. సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా సుధాశ్రీనివాస్, శ్రీసత్య రూపశ్రీ, సునీల్ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

దేవీనగర్‌లో చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగుల కొట్టి చోరీ చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవీనగర్ ఒకటో లైనులో నందివాడ వెంకట శ్రీదేవి దంపతులు నివసిస్తున్నారు. శ్రీదేవీ భర్త పోస్ట్ ఆఫీస్‌లో పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నారు. వీరు ఈనెల 23వ తేదీ రాత్రి 9 గంటలకు ఇంటికి తాళం వేసి పుట్టపర్తి గుడికి వెళ్లారు. 25వ తేదీ సోమవారం ఉదయం 11.30 గంటలకు ఇంటి పక్క వారు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని చెప్పారు. దీంతో మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంటికి చేరుకుని వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని రూ.24 వేలు, బెడ్‌రూమ్‌లో రూ.12 వేలు, అర కాసు బంగారు బుట్టలు, 17 తులాల వెండి పట్టీలు మాయం అయ్యాయి. దీంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సీఐ గురుప్రకాష్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్పొరేటర్ జానారెడ్డి బాధితులను పరామర్శించారు.

రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి
- అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ప్రారంభం
- పశ్చిమంలో 5,912 మంది యువకులు, 3,957 మంది యువతులు పేర్లు నమోదు
- ఉత్సాహంగా పాల్గొన్న యువత



క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం పశ్చిమ నియోజకవర్గంలోని కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేసి, క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించి యువకులను అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేసేందుకే క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు స్థాయిల్లో, ఐదు రకాల ఆటలను ఈ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి 5,912 మంది యువకులు, 3,957 మంది యువతులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

రూ.12 కోట్ల బహుమతులు

వార్డు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖో ఖో, బ్యాడ్మింటన్ ఆటలు నిర్వహిస్తున్నామని



టాస్ వేస్తున్న కార్పొరేటర్ రత్నకుమారి

ఎమ్మెల్యే వెలంపల్లి చెప్పారు. మంగళవారం నుంచి 45 రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. అందరికీ ఆరోగ్యంతో పాటుగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నగరంలో అన్ని పార్కులు అభివృద్ధి చేశామన్నారు. క్రీడా మైదానాలను చక్కగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఆడుదాం ఆంధ్రాలో యువత పాల్గొనాలని కోరారు. క్రీడలతో శారీరక దృఢత్వం వస్తుందన్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఇండోర్ స్టేడియాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రతి ఒక్కరూ వాకింగ్ చేసుకునేందుకు పార్కులు అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రూ.12 కోట్ల విలువ చేసే బహుమతులను అందజేస్తామన్నారు. గతంలో చంద్రబాబు ఇటువంటి కార్యక్రమాలు ఎప్పుడు చేపట్టలేదన్నారు. చంద్రబాబు చెయ్యలేని ఆలోచనను జగన్‌మోహన్‌రెడ్డి చేసి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని క్రీడలలో మొదట వరసలో ఉంచేందుకు ముఖ్యమంత్రి పాటుపడుతున్నారన్నారు.

పోటీల్లో లక్షలాది మంది యువత

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాపితంగా లక్షలాది మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు, బుల్లా విజయకుమార్, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, పార్టీ నేతలు తంగెళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కేబీఎన్ కాలేజీలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్లు

క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కృషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని చేపట్టారని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, గ్రౌండ్ ఇన్‌చార్జి హెలెన్, స్కూల్ పీటీ సురేష్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



డిస్ ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించిన గౌస్ మొహిద్దీన్, రత్నకుమారి, దుర్గారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ 158వ సచివాలయం పరిధిలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు. తొలుత సచివాలయం పరిధిలో లబ్ధి పొందిన వారు, ఆ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. గత ప్రభుత్వానికి, సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ పాలనకు వ్యత్యాసం గమనించిన ప్రజలు జగనన్నే కావాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వీరంకి సత్యనారాయణ, సురేష్, గుంజ కొండలరావు, టీ రమణ, ముత్తా వాసు, వల్లం రవికుమార్, అద్దేపల్లి సత్యనారాయణ, కె.రఘు పాల్గొన్నారు.

వీఎం రంగా సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ శాసనసభ్యుడు వంగవీటి మోహనరంగా నగరానికి అందించిన సేవలు అపూర్వమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ సీపీ నేత వడ్లని మాధవరావు ఆధ్వర్యంలో స్థానిక శంకర్‌కేఫ్ సెంటర్‌లో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ నేతలు, కార్పొరేటర్లతో కలిసి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. రంగా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు, నాయకులు జీఎంసీ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ఆధ్వర్యంలో..

వన్‌టౌన్ 53వ డివిజన్ రాయల్ హోటల్ సెంటర్ వద్ద ఉన్న వీఎం రంగా విగ్రహం వద్ద స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో రంగా వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై, రంగా సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, నాయకులు పడాల చిన్నా, చాన్‌బాషా, రెహమాన్, సోల్జర్, చోటు, కంచి బాబు, బెవర శ్రీను, నరహరిశెట్టి జ్యోతి, అంజిబాబు, నాగోతి గురు పాల్గొన్నారు. కొత్తపేట 51వ డివిజన్‌లో కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ కార్యాలయం వద్ద వీఎం రంగా వర్ధంతిని నిర్వహించారు. కార్పొరేటర్ రాజేష్ రంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాజీ ఎమ్మెల్యే



రాయల్ హోటల్ సెంటర్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి



రంగా విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వెలంపల్లి, నాయకులు

దివంగత వంగవీటి మోహనరంగారావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వీఎం రంగా వర్ధంతి సందర్భంగా విద్యాధరపురం చెరువు సెంటర్‌లో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మైలవరపు కృష్ణ, గొంది ప్రసాద్, సంభాన బాబూరావు, వీ లీలామధు, వల్లం రవికుమార్, అంకాన నాగరాజు, పెద్ది రాజారావు, షఫీఉల్లా, లేళ్లపూడి లాజర్, ఇనపకుర్తి రాము పాల్గొన్నారు.

చిట్టినగర్ కుండలబజార్‌లో 47వ డివిజన్ వైఎ



శంకర్‌కేఫ్ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, నాయకులు

స్సార్ సీపీ అధ్యక్షుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కూరాకుల నాగేశ్వరరావు(నాగ) ఆధ్వర్యంలో వీఎం రంగా వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ వై.చలపతిరావు, అత్తలూరి పెదబాబు, దేరంగుల రమణ, మద్దిరాల ప్రభాకర్, బోయళ్ల రాజేష్, యరజర్ల మురళి, ఇ విజయలక్ష్మి, ఎస్ వెంకటేష్, జీడీ, అమర్, తాండ్ర ఇంద్ర, పెద పాండు పాల్గొన్నారు.

స్టేడియానికి వీఎం రంగా పేరు పెట్టాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలో నిర్మిస్తున్న క్రీడా స్టేడియానికి మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి ఐక్య సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మైలవరపు దుర్గారావు, అధ్యక్షుడు పదిలం రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యాధరపురం వీఎం రంగా జంక్షన్‌లోని సంఘ కార్యాలయంలో మంగళవారం రంగా వర్ధంతిని నిర్వహించారు. రంగా ఆశయ సాధనకు కాపు సామాజికవర్గం ఒకే తాటిపై నిలిచి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, మైలవరపు కృష్ణ, నాయకులు పాల్గొని రంగా చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

దాసాంజనేయస్వామివారిని దర్శించుకున్న స్పీకర్ తమ్మినేని

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారిని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్పీకర్ తమ్మినేని సీతారాంకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం చిత్రపటంతో సత్కరించారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, కూచిపూడి నృత్యాలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి.



స్వామి వారిని దర్శించుకుంటున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఓపెన్ చెస్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని శ్రీగౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని స్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఈ నెల 23న విజయవాడ గుణదల సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఈ పోటీలు జరిగాయన్నారు. అండర్–11 కేటగిరిలో విజ్జి హేమంత్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీతో పాటు రూ.3 వేల నగదు, చిలకలపల్లి చరణ్‌చంద్ రెండో స్థానంలో, అండర్–13 కేటగిరిలో పబ్బిశెట్టి భార్గవ్ మొదటి స్థానం, సక్కురి యశ్వంత్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా ఇండోర్, అవుట్‌డోర్ క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి.తులసీ, చెస్ కోచ్ ఏ.రామకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తులసీ, కోచ్ రామకృష్ణ

సామాజిక సేవకుడు హాజీ దుర్బేసుల హుస్సేన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో అందరి మేలు కోరే సామాజిక సేవకుడు హాజీ దుర్బేసుల హుస్సేన్ అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. విద్యాధరపురం కరెంట్ ఆఫీస్ రోడ్ (జోజినగర్)గా పిలువబడుతున్న రహదారికి నగరపాలక సంస్థ హాజీ దుర్బేసుల హుస్సేన్ రోడ్డుగా నామకరణ చేయగా మంగళవారం ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్యతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా 45వ డివిజన్ పరిధిలోని భాష్యం స్కూల్ పక్కన నూతనంగా నిర్మించిన రోడ్డు, కబేళా రోడ్‌ను వారు ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, నాయకులు మైలవరపు కృష్ణ, లలితా రైస్ బాషా, భీముడు, దస్తగిరి, దుర్బేసుల వన్నూరమ్మ, డి.ఖాసిం, అల్లం భువన్ కుమార్, డి.రాము, కోటేశ్వరరావు, ముత్తా వాసు, ముత్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

ఘనంగా దత్త జయంతి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బాబా వారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దత్త హోమం జరిగింది. శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం మార్గశిర పౌర్ణమి, దత్త జయంతి పురస్కరించుకుని దత్తాత్రేయస్వామి వారికి విశేషంగా అభిషేకం, నాగ పడకల పూజను పీఠాధిపతి శివ చార్యులు నిర్వహించారు. శివ ముక్కోటి అక్షీశ్వర మహాదేవునికి స్వర్ణ పుష్పాభిషేకం చేశారు. మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో 108 కలశములతో విశేషంగా దత్తాత్రేయస్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. మందిర కమిటీ గౌరవాధ్యక్షులు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్ రాజు, మందిర అధ్యక్షుడు వైవీ శివాజీ, జీ హేమ శివసత్యప్రసాద్, కోసేరు మంజుల రాణి పర్యవేక్షించారు. పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ భగత్ సింగ్ పార్క్ సమీపంలోని శ్రీ సద్గురు సంస్థాన్‌లో శ్రీదత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బొమ్మదేవర శ్రీనివాస్, జొన్నవిత్తుల రామకృష్ణ, సీహెచ్ వెంకట రమణ మూర్తి దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సంస్థాన్ అధ్యక్షుడు పి.రామారావు, అరుణ, సరస్వతమ్మ, లక్ష్మి పర్యవేక్షించారు. ఆయా ఆలయాల్లో అన్నప్రసాద వితరణ జరిగింది.

పేదలకు దుప్పట్ల పంపిణీ

విజయవాడకల్చరల్: రమణా కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ధనుర్మాసం సందర్భంగా సినీ సంగీత విభావరి, వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తూర్పుకాపు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గడి ఝాన్సీ మాట్లాడుతూ వంగవీటి రంగా ప్రజల కోసం పనిచేశారన్నారు. మోహన రంగా సామాజిక సేవలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రమణా కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాంతి రమణ మాట్లాడుతూ.. సంస్థ ద్వారా పేద కళాకారులకు సేవ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి దేవిడ్‌రాజు, గాయకుడు రమాశంకర్ పాల్గొన్నారు. పేదలకు వస్త్రదానం చేశారు. సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

● వైభవంగా కలశ జ్యోతుల మహోత్సవం







ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భవానీలు, భవానీ భక్తులు మంగళవారం సాయంత్రం కలశ జ్యోతులను సమర్పించారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రి వరకు నిర్వహించిన కలశ జ్యోతుల మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భవానీలు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మ వారి నామస్మరణ చేస్తూ కలశ జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

